సరుగుడుతోపులో.........

గొల్లపూడి జోగారావుగారు

నా కప్పటికి యిరువదినాలుగు. ఆనందమయ జీవితద్వారమున అడుగిడిన నన్ను అంతులేని యీ దుఃఖప్రపంచమునకు గిరవాటు వైచినది విధి. అనంతమైన యీ విశ్వంలో నేనుతప్ప నా అని చెప్పుకోడానికి నాకు యెవరూ లేరు. నేను యేకాకిని కావుననే నిస్సారమైన సంసారమోహమునబడి కొట్లాడు నాతోడివారలు నాకు హాస్యాస్పదులయ్యేరు. వారి జీవనప్రవృత్తికి అసహ్యించుకొనేవాడ్ని. స్వార్థరహితమయిన ప్రకృతియే నాకు ఆనందదాయిని అయింది. అంతేకాదు. విధియొక్క నిరంకుశ శాసనమునకు లొంగి నిరాధారమై యీ విశ్వంలో కొట్లాడు నావంటి కష్టజీవికి అమృతమయమైన తన అద్భుత గానంలో లీనమొనర్చి లాలించి ఆనందమొనగూర్చ జాలునది వొక్క ప్రకృతియే గదా!

నా నిత్యజీవనమునకు నే జేయవలసిన కార్యము నిర్వర్తించుకొని మావూరికి చివరున్న సరుగుడు తోపు కేసిపోయేవాడ్ని అనుదినమూ. సముద్రములోకి పోయే గెడ్డప్రక్కగా యిసికలో కూర్చొని ఆ ప్రకృతిలో లీనమయ్యేవాడ్ని. ఫర్లాంగుదూరంలో సముద్రఘోష శ్రావ్యంగా వినబడేది. తోపులోంచి పడమట నలముకొన్న సంధ్యారాగము...... అందులోంచి యెగసిపొయ్యే పిట్టల కూజితముల్లో నా జీవితవ్యథ మరచేవాడ్ని. ఆ ప్రశాంతములో శుక్లపక్ష యామినులలో ప్రకృతి జోకొడుతోంటే యీ యిసికలోనే పరుండి అనిర్వాచ్యమైన వొక అపూర్వానందమును పొందేవాడ్ని. ఎదురుగావున్న అంతులేని జలభాగాన్ని పరికిస్తూ నిలువున పొంగి క్రుంగి పొయ్యే కెరటములో నిగూఢమైన ఆ లీలామూర్తి శక్తికి విస్మయమందేవాడ్ని. నా అల్పత్వమును గ్రహించి ఆ దివ్యమూర్తిని ధ్యానించేవాడ్ని యెంతో సేపు...............

ఇలా నా సాయంత్రపు స్వేచ్ఛావిహారముల్లో కాలచక్రము యెంత తిరిగిపోయిందో నాకు తెలీదు. నాడు పడమట సంధ్యారాగము అప్పుడే అంతరించిపోతోంది. అంబరతలాన్ని అయిదారు చుక్కలు మెరుస్తున్నాయి. సంధ్యావాయువులో పొడుగ్గా పెరిగిన సరుగుడుకొమ్మలు వూగాడుచు యేదో వొక అపూర్వమైన గానమొనరుస్తోన్నాయి. ఆ వాతావరణములో మైమరచి యిసికలోనే పరున్నా. తోపులో వింతవింతగా అరుస్తోన్న పిట్టల కూజితముల్లో స్పష్టమై 'లిల్లీ' అను వొకపిలుపు వినబడ్డాది. ఆ సరుగుడుతోపు కేసిచూచేను. ఆశాపులకితమ్ములయిన నాకనుల కగబడిన దేదీ లేదు. అయిదు నిముసములు గడచేయి. 'లైలా' అను కేక తోపులో మారుమ్రోగింది. అది యిందాకటి గొంతుక కాదు. లేచి తోపుకేసి వెళ్లాను. ఇనపతివ్వతో చాలవరకు ఫెన్సింగు అడవితీగెలతో అల్లివుంది. గేటుదాటి లోన ప్రవేశించాను. బంగళాకి ముందుగా అల్లిన రాధామనోహరందగ్గర చక్కని కుక్కతో పెనగులాడుతో వొక యువతివుంది. ఆ అస్పష్టసంధ్యాలోకంలో ఆమె అపూర్వతరుణీమూర్తి. ఆమె నిలువున లేచినించుని తటాలున నా కేసిచూచింది. నా రక్తనాళముల్లో యేదో ప్రవహించినట్లయింది. ఆమె వెనుదిరిగి కుక్కతోసహా బంగళాకి ప్రక్కగా వెనుకకు వెళ్లిపోయింది. నే నక్కడ యెంతోసేవు నిలబడలేదు. దారిలోమాత్రం యింతకాలము నాకు కనబడని ఆ బంగళా దానిలోని మనుజుల విషయమై తలచినపుడు కొంత విస్మయము కలుగకపోలేదు.

సరుగుడు తోపులో

మరి మూడురోజులు ఆ అమ్మాయి జాడలేదు. నాటి సాయంత్రము నా మామూలుప్రదేశాన్ని వదలి గెడ్డలోకిపోయాను. సన్నని నీటిపాయ వోవారగా ప్రవహిస్తోంది. అస్తంగతసూర్యకిరణము లా ప్రదేశముపైబడి అపూర్వంగా ప్రతిబింబిస్తోన్నాయి. గెడ్డలోంచి ఆమె ఆరేళ్ల అబ్బాయిని వెంటబెట్టుకొని మెల్లగా నడచివస్తోంది. ఆమె ధరించిన తెలివస్త్రం మామె శరీరమునకు శోభ గూరుస్తోంది. ఆ అబ్బాయి ఆమెతో యేదో మాట్లాడుతున్నాడు. ఆమె నన్ను చూచింది. గెడ్డలోంచి రోడ్డుపైకి పోవటానికి ప్రయత్నిస్తోం దామె. ఆ అబ్బాయికూడ చూచేడు.

'అబ్బాయి! యిలారా!'

అత డామె ముఖంలోకి చూచేడు.

'ఇలారా!'.........తిరిగీ పిలచేను.

'వెళ్లు'.

మెల్లగా అడుగువేసుకుంటూ ఆ అబ్బాయి నా దగ్గరకు వచ్చేడు.

'నీ పేరేమిటి ?'

'మాస్టరు క్రేసీ !'

నేను కన్నెత్తి చూచేను. ఆమె నిశ్చలంగావుంది.

'మీ నాన్నగా రేమిచేస్తున్నారు ?'

'ఇంజనీయరు.'

'అలాగా! ఇప్పు డిలా యెక్కడికి వెళ్తావు ?'

'షికారు.'

ఆ అబ్బాయి స్పష్టమైన ఉచ్చారణకు నేను ఆశ్చర్యపోయాను.

'ఆమె యెవరు ?'

'మా దాది.'

ఆమె చలించినది. బుగ్గలు యెర్రబారినై. గెడ్డలో వోపక్షి యెగిరిపోతూ వింతగా అరచింది. దూరాన్ని సముద్రపుఘోష స్పష్టంగా వినబడుతోంది.

'వెళ్లిపోదాం రా !'......ఆమె పిలచింది.

క్రేసీ నాపట్టు విడిపించుకున్నాడు.

'పోతాను.'

అత డామెదగ్గరకు పోయాడు. ఆమె రోడ్డుమీదకి పోయింది. ఆమె వెళ్లిపోయేవరకు నాకామె సౌందర్యము మనసులో తట్టనేలేదు. నేను 'గబగబ' రోడ్డుపైకి వచ్చేను. ఆమె తోపులోకి వెళ్లిపోతూ నాకేసి చూచింది. ఇసికలోకి పోయాను. ఆలోచన్లో యెంతసే పలా పరున్నానో రోడ్డుమీద పోతూన్న వోకారు శబ్దంవిని లేచాను. ఆ ప్రదేశమంతా చల్లనివెన్నెలతో నిండివుంది. రోడ్డుమీద పోతూన్నపుడు మాత్రం నా చూపులు సరుగుడుతోపులోని బంగళాకేసి పరిగెత్తాయి వోసారి.

ఆ మరునాటినుంచీ లైలా (అది ఆమె పేరు) ప్రతిదినమూ క్రేసీని తీసుకొని గెడ్డలోకి వస్తోండేది. కాని ఆమెతో పరిచయము నాకు రోజుకురోజూ క్రొత్తగానేవుండేది. లైలా మాత్రం నాతో మాట్లాడేందుకు జంకేదికాదు. క్రేసీ చాలా పేరుమోసిన యింజనీయరని యిక్కడ 'వాటరు వర్క్సు' సరిచూడ్డానికి ప్రభుత్వమువారు నియమించగా వచ్చేరనీ చెప్పింది. అతని భార్యా రాధాభాయికి ఆమెను చూస్తే యెంతో దయని చెప్పింది. చిన్నక్రేసీ ఆమెను విడిచి నొక్కగడీ వుండడుట. ఇలా యెన్నో విషయాలు ఆమె వింతగా చెపుతోండేది. లిల్లీకి ఆమెకు వున్న పరిచయము వోనాడు యెంతో చమత్కారంగా వర్ణించింది.........ఆమె అలా చెపుతూంటే ఆ చిన్ననోరు, చక్కని పెదవులు, తీర్చిన కనుబొమలు, ప్రేమతో మెరిసిపొయ్యే కనులు చూస్తో అలా వుండిపోయేవాణ్ని. ఆమె నాలోకి చూచి చలించేది. నా అవివేకానికి నాలోనే సిగ్గుజెందేవాణ్ని. కాని ఆమె చక్కనిముఖం నా హృదయంలో చిత్రింపబడ్డాది. ఆమె ముఖంలో ప్రస్ఫుటించే విషాదరేఖకూడ నా మనసులో నాటుకుంది. ఆమె యీ దాదిత్వమున కెలా వొప్పుకుంది. ఆమెకు యిలా

ప్రపంచములో బందుగులే లేరా? ఈ రాధాబాయమ్మ ఆమె కేమి కావలయును? ఆమె జీవితములో యేదో రహస్యముందని గ్రహించేను. నావలె ఆమెదికూడ భగ్నజీవితమేమో అని తలచినపుడు మాత్రం నా హృదయం సంక్షోభించేది–నా శరీరము వడకేది.........

నాడు యెనిమిదిగంటు లయింది. చంద్రకిరణములు సముద్రజలముపైపడి అపూర్వంగా ప్రతిబింబిస్తోన్నాయి. బాట బడిపోయే వొకటి రెండు కార్ల శబ్దం అప్పుడప్పుడు వినబడుతోంది. దూరాన్ని జాలరిగుడిసెల్లో పాడేపదము అస్పష్టంగా వినబడుతోంది. లైలా లిల్లీని వెంటబెట్టుకొని నీటిదగ్గరనుంచి వొకర్తే వస్తోంది.

'లైలా!'

ఆమె మెల్లగావచ్చి యిసికలో కూర్చుంది. లిల్లీ ఆమె వొడిలో కెక్కి నా ముఖంలోకి చూస్తోంది.

'నీ జీవితముగూర్చి నా కేమీ తెలియదు.'

లైలా నిశ్చలంగా కూర్చుంది.

'తెలిసికోవాలని అభిలషిస్తోన్నాను.'

'నాజీవిత మెవరికిని ఆనందము గూర్పజాలదు.'

ఆ నిండువెన్నెల్లో లైలా వో దేవతాస్త్రీకి మల్లే అగుపడింది. ఆమె విశాలనేత్రాల్లో అపూర్వమైన కాంతి ప్రకాశించింది. నాలో జయించరాని వొకానొక కోర్కె ఆమె శరీరమును తాకి, ఆమెను దగ్గరగా జేర్చుకొని, బుజ్జగించుమని ప్రేరేపించింది నన్ను. కాని ఆమె నిశ్చలత్వము?

అయినా నేను జరిగేను. ఆమె మొగముపై మొగముంచి 'భయములేదు. నీ జీవితరహస్యమును నాకు చెప్పు' అని అడుగుదామనుకున్నాను. అంతలోకె ఆమె

'నా జీవితచరిత్రను మీకు చెప్పుట కట్టి అభ్యంతరము లేదు. కాని యిప్పుడు చెప్పలేను.

ఆమె వొడిలోనున్న లిల్లీని నిమిరేను.

'లిల్లీ చాల అందమైనది.'

'అవును.'

'అది చాల విశ్వాసమైనదని కదూ చెప్పావూ!'

'............'

లైలా లేచింది.

'నేను వెళ్లిపోవాలి.'

నేనుకూడ లేచాను. సరుగుడుతోపువరకు మేమిరువురు మాట్లాడలేదు. ఆమె గేటుదరి ఆగింది. వెళ్లిపోతానని తల నాడించింది. ఆమె కన్నుల్లో మాత్రం అపూర్వమైన వొకజ్యోతి ప్రకాశించింది.

మరి కొంతకాలమువరకు లైలా నా ప్రత్యక్షంలోకి రాలేదు. మాలితో వివాదపడుతోన్నప్పటి ఆమె గొంతుక విన్నాను. ఆతృతతో కర్రమెట్లు దిగివస్తోన్న ఆమె మూర్తిని చూచేను. తర్వాత ఆమె జాడలేదు. ఆనాడు సరుగుడు తోపుకేసి శూన్యంగా చూస్తున్నాను. తోపులోంచి పడమట శుక్రుడు ప్రకాశిస్తున్నాడు. లిల్లీ నాకేసి పరుగెత్తుకొస్తూంది. అది నన్నుచూచి మళ్లా తోపుకేసి పరుగెడుతోంది. నే నలాగే కూర్చున్నాను. అది వెనుదిరిగి నాముందు అరుస్తో తోపుకేసి పరుగెడుతోంది. నేను లేచాను. దానివెంటనే తోపులోకిపోయాను. అది తిన్నగా నన్ను బంగళాలోకి తీసుకుపోయింది. సముద్రముకేసివున్న వొకగదిలో లైలా పరుపుపై పడివుంది. ఆమె వంటిపై స్పృహలేదు. దగ్గరగావున్న చిన్న మేజాపై నొకకాగితము మడతపెట్టబడివుంది. నేను విప్పిచూచేను. బుద్ధిపూర్వకంగా నేనే ఆత్మహత్య చేసికొన్నానని లైలా ప్రకటించిందులో. మూలనున్న కూజాలోని నీరుతీసి ఆమె ముఖంపై జల్లేను. ఆమె తలక్రింద యెత్తుగ దిండునుంచి ఉపచారములు చేస్తున్నా. పది నిముసములకు లైలా కనులువిచ్చి నా ముఖంలోకి చూచింది.

సరుగుడు తోపులో

'మీరు వచ్చారు!...........లిల్లీ యిట్టిపని చేస్తుందని నే ననుకొన్నాను...........'

ఆమె మరల కనులు మూసింది. అప్పుడప్పుడు వూరుకొంటూ యిలా చెప్పుకొచ్చింది.

'నా పేరునుబట్టి మీరు సంశయింపవచ్చును కాని నేను పవిత్రమైన బ్రాహ్మణకుటుంబములో పుట్టేను. నా మొదటిపేరు రాధ. నాతల్లి అయిదవయేటను, నాతండ్రి పదియవయేటను చనిపోయారు. నాఅన్న నన్ను అతిప్రేమతో చూస్తూ నాకు విద్య నేర్పించారు. భాగ్యమైన, గౌరవమైన వొక కుటుంబములోని విద్యావంతుడైన వొకరికి నన్నిచ్చి వివాహము చేసాడు. నాకు పెండ్లిఅయి రెండు సంవత్సరము లయింది. ఆయన చదువు పూర్తిచెయ్యలేదు. పెద్ద చదువుకై లండను వెళ్లిపోయారు.........ఇంట్లో మావదినె పోరు ప్రారంభమయింది. ఒక సంవత్సరము యెంతో సహనముతో భరించాను. ఒకనాటి వుదయం నాఅన్న నాదగ్గరకు వచ్చి, 'మీ అత్తవారింటికి వెళ్లుటకు నీ కిష్టమా?' అని అడిగేడు. 'ఆయనలేనితరి నే నక్కడకు వెళ్ల' నన్నాను. 'సరే' అని వాడు వెళ్లిపోయాడు. ఆరునెలలు గడిచాయి. క్రమంగా మా వదినెకు నాకూ జరిగే వివాదములు తీర్చలేక వాడికి విసుగు జనించినది. వాడి ఆనందమయ జీవితాకాశమున తోకచుక్క పొడమినది. వాడి విషాదమును నేను భరించలేకపోయాను. ఒకనాటిరాత్రి మాఅన్న సూటుకేసు తెరచి యిరవై రూపాయిలు తీసుకొని చీటివ్రాసి అనంతమైన యీ విశ్వంలో పడ్డాను. అప్పటికి నాకు పదునారేండ్లు. చెన్నపట్నం చేరాను. మాఅన్న స్నేహితు డొకడు సివిలుసర్జను వొకవారంలో అతని సహాయాన్ని హాస్పిటలునర్సు ట్రయినింగుకు వెళ్లాను. అప్పట్లోనే నేను పేరు మార్చుకోటం అయినతర్వాత హాస్పిటలులో నొక సంవత్సరము నర్సుగా పని చేసాను. కాని అక్కడ ....'

శైలా వొకగడీ వూరుకుంది.

............కొన్నివిషయాల్లో హాయమనిపించింది. నేను దాన్ని వదిలీసేను. తర్వాత వొక జాతీయపాఠశాలలో ప్రవేశించి శిశుపోషణము, చిత్రలేఖనము, కుట్టు యివి నేర్చుకున్నాను. ఆ పాఠశాల వార్షికోత్సవమునకు రాధాభాయమ్మ అధ్యక్షురాలుగా వచ్చింది. మా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నా తెలివి నుగ్గడించి చెప్పింది. రాధాబాయమ్మ నన్ను రమ్మని పిలిచింది. నేను వొప్పుకున్నాను. అప్పటికి చిన్నట్రేసీకి నాలుగేండ్లు. వారితో నే ననేక పట్నములు తిరిగేను. (కాని నేను వెళ్లిపోయిన తర్వాత ఆంధ్రదేశమునకు రావటం యిదే తొలిసారి) నా యజమాని నన్నప్పుడప్పుడు వింతగా చూస్తుండేవారు. అట్టిసమయాల్లో నాకు భయంగావుండేది. నే నతనికి వొంటరిగా కనబడే దాన్ని కాను.........నేను లిల్లీతో బీచికి వచ్చిన నాటి సాయంత్రమే రాధాభాయమ్మ చిన్నట్రేసీతో చెన్నపట్నం వెళ్లింది. మీకు కనబడేసరికి అప్పుడు నేను భోజనంచేసాను. మీరు వెళ్లిపోయిన తర్వాత నేను నా గదిలోకిపోయాను. కాని నాకు నిద్రపట్ట లేదు. పైకివచ్చి రాధామనోహరందగ్గర నిలబడ్డాను. వెన్నెల కాస్తోంది. దగ్గరున్న గులాబీతుప్పలో నొక మొగ్గ అప్పుడే విడుతోంది సరుగుడుకొమ్మలు చల్లని ఆ నిశావాయువులో మెల్లగా వూగాడుతున్నాయి. ఏదో వొక పట్టరానితమకము నన్ను ఉద్రేకించినది. అనిర్వాచ్యమైన యేదో వొక అపూర్వానందముకై నా శరీరము తహతహలాడింది. పైకి చూచేను. మీది మెట్టుమీద నా యజమాని నించున్నాడు... ..!

ఆమె మళ్లా వూరుకుంది.

ఆమె మొఖం జేవురించుకొనివుంది.

.........ఆ బంగళాలో యెవరూలేరు. నేనూ, నా యజమానితప్ప. [illegible] స్వభావసిద్ధమైన [illegible]

పోయాను......................పదిరోజులు గడచి పోయాయి. రేపు రాధాబాయమ్మ వస్తుంది. నాకు విశేషదుఃఖ మొచ్చినది. నా ప్రకృతజీవనముపై అసహ్యమేసినది.........అందుచే విషము తిన్నాను.'

'విషము తిన్నావా!' అంటూ ప్రేసీ పరుపుదగ్గరకు వచ్చాడు. లైలా భయవిహ్వాల అయినది. నేను నిర్ఘాంతపోయాను. కాని అతని కనులలో దుఃఖము పొంగి పొరలుతోంది. దానితో అతని మొఖం జేవురించుకొనివుంది.

"రాధా! నిన్నట్టి కష్టములపాలొనరించిన నీ భర్తను నేనె. లండనులోనున్నపుడే నీ కనేక జాబులు వ్రాసేను. నాకు నీ జాడే తెలియలేదు. ఈ దేశమునకు వచ్చిన తర్వాత నీకొఱకు వెదికేను. ఇందు నేను చేసిన తప్పిదమేమియు లేదు. నేను ఆంధ్రునివలె వుంటే నన్ను పోల్చివుందువేమో! కాని యీ ఆంగ్ల వేషమంతా నాకు విదేశములో అలవడినది."

అతని కనులనుండి వొకటి రెండు అశ్రుకణములామె వాడిపోయిన చెక్కిళ్లపై బడ్డాయి. లైలా తన రెండు కరములతో అతని కంఠమును పెనవైచి తన ముఖంమీదికి లాక్కుంది. అతడామె అదరుతోన్న పెదవులను ముద్దుపెట్టుకున్నాడు.

'ధన్యురాలను.'

రాధ కనులు మూసినది.........మరి ఆమె తిరిగీ తెరువలేదు.

సౌదామినీ

శ్రీమతి కొల్లూరి గౌరీదేవిగారు

ఈ యనంతగాఢాంధకారాయతాభ్ర
పథమునందున ఫెళఫెళార్భటులతోడి
జలద సంచయమందున సాగియొంటి
నెచటకేగెదొ సౌదామినీ! వచింపు.

అతిమనోజ్ఞ నక్షత్ర నీలాభ్రవీధి
హర్షదానందములతో విహారమాను
ప్రావృషభ్రపయోధర స్వామివలచి
తిరుగుచుంటివా యీరీతిదిశలనెల్ల ?

భయదగంభీరమా కృష్ణపక్షనిశిని
ఘోరమైన యీ యాషాఢమాసమందు
[illegible] మెరయుచుండ
[illegible]చుంటివా మేఘుగూడి.

శంఖభేరీరవంబుల జైత్రయాత్ర
సలుప, సమరసన్నాహాయుత్సాహమిళిత
ధైర్యసాహసగంభీర దర్పమలర
విశృతవనాంతరోదగ్ర వీధులందు

గ్రేళ్లురుకు మృగచందంబు గేళిసేసి
వెడలుచుండెడి రసపుత్రువీరువోలె
నేగుచున్నావు, నీకంతవేగమేల ?
ప్రబలదుర్భర సంతాపభరమును భవ

దమృతధారాప్రవాహంబు నణగజేసి
నవ్యనవనీత మృదుసమానంబులయిన
లేతభావంబులహృది నిర్ణీతపరచి
సంతతానందమునుగూర్చి చనగరాదె ?